Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 351 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 6 - 6 - 2025


94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## తొక్కిసలాట కేసులో ఆర్‌సిబి యాజమాన్యంపై విచారణ




**ఇంటర్నెట్ డెస్క్:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవం ఆపై జరిగిన తొక్కిసలాటకు సంబంధించి టీం యాజమాన్యం విచారణ ఎదుర్కోబోతోంది. వీరితో పాటు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసి యేషన్ సీనియర్ సభ్యులను కూడా విచారించనున్నారు. ఆర్సీబీ క్రికెటర్లకు సత్కార వేడుకను ప్లాన్ చేయడంలో వీరి పాత్రను ఇప్పుడు బెంగళూరు పోలీసులు, ఇంకా మెజిస్టీరియల్ విచారణ ప్యానెల్ సమీక్షిస్తోంది. ముఖ్యంగా తొక్కిసలాటకు కొన్ని గంటల ముందు ఆర్‌సిబి మేనేజ్‌మెంట్ పెట్టిన సోషల్ మీడియా పోస్ట్‌పై విచారణ జరగనుంది. ఆర్సీబీ క్రికెట్ టీం విజయాన్ని పురస్కరించుకుని బెంగళూరు ఎం చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవం, ఆపై జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా, 47 మంది గాయపడిన సంగతి తెలిసిందే. అయితే, ఘటనకు కొన్ని గంటల ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం సోషల్ మీడియా 'ఎక్స్'లో ఈవెంట్‌కు సంబంధించి అధికారికంగా ఒక పోస్ట్ పెట్టింది. జూన్ 4వ తేదీ మధ్యాహ్నం గం. 3:14కు ఆర్సీబీ అఫీషియల్ 'ఎక్స్' హ్యాండిల్‌లో ఈ పోస్ట్ పెట్టింది. 'విక్టరీ పరేడ్ తర్వాత చిన్న స్వామి స్టేడియంలో వేడుకలు జరుగుతాయి. అందరూ రోడ్‌షోను శాంతియుతంగా ఆస్వాదించగలిగేలా పోలీసులు, ఇతర అధికా రులు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని మేము అందరు అభిమానులను అభ్యర్థిస్తున్నాము. ఉచిత పాస్‌లు (పరిమిత ప్రవేశం) shop.royalchallengers.comలో అందుబాటులో ఉన్నాయి" అని సదరు పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిపైనే ముఖ్యంగా దర్యాప్తు చేయనున్నారు. 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఆర్‌సిబి తొలి ఇండియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్ సొంతం చేసుకుంది. ఈ విజయాన్ని సెలబ్రేట్ చేసుకోసుకునే క్రమంలో జూన్ 4 బుధవారం మధ్యాహ్నం తొక్కిసలాట జరిగింది. అయితే, ఈ ఈవెంట్ నిర్వహించుకోడానికి జూన్ 3వ తేదీన ఆర్సీబీ యాజమాన్యం కేఎస్‌సీఏ ద్వారా అధికారులకు ఒక లేఖ పంపింది. విధానసౌధలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలనేది ఈ లేఖ సారాంశం. అయితే, చివరి నిమిషంలో ఈ ఈవెంట్‌కు అనుమతి వచ్చిందని కర్నాటక ప్రభుత్వం చెబుతుండగా, ప్రోపర్ ప్లానింగ్ దృష్ట్యా ఈ వేడుకను కనీసం రెండు రోజులు వాయిదా వేయాలని కోరామని బెంగళూరు పోలీసులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసు ఎలాంటి మలుపు తీసుకుంటుందో చూడాలి.

## పర్యావరణ పరిరక్షణలో ఏపీని ఆదర్శంగా చేస్తాం : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి పరిధిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతవరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడు తూ.. మొన్నటి వరకు వనజీవి రామయ్యను చూశామని.. ఆయన లేకపోయినా ఇప్పుడు నల్లమల పరిరక్షణ కోసం అంకారావు కృషి చేస్తున్నారని అన్నారు. ఈరోజు ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాయల సీమ ప్రాంతంలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని.. దీని పర్యావసానంగా ఇతర ప్రాంతాల్లో కూడా గ్రీన్ కవర్ పెరుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి చెట్ల వల్ల ఉపయోగం తెలియదని.. వారికి చెట్లు నరకడం తప్ప చెట్లు పెట్టడం తెలియదని విమర్శించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వెళితే కింద రోడ్డుపై చెట్లు నరికేవారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వస్తుంటే ఎక్కడైనా ఒక్క చెట్టు తాము నరుకుతున్నామా అని ప్రశ్నించారు. కొన్ని దేశాల్లో చెట్లు నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారన్నారు. చెట్లు నరికితే మనిషిని చంపినట్టే అని కొన్ని దేశాల్లో చట్టాలు కూడా ఉన్నాయన్నారు. నాలుగు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 37 శాతం గ్రీన్ కవర్ రావాల్సి ఉందన్నారు. జీవితంలో 10 చెట్లు కంటే ఎక్కువ పెట్టి పెంచుతున్నవారు ఉన్నారని.. అసలు చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది అని సీఎం చంద్రబాబు నిలదీశారు. రాఖీలు కట్టే చెల్లెమ్మలకు ఇకపై అన్న నక్షత్రం పేరుకు తగ్గట్టుగా విత్తనాలు ఇస్తామన్నారు. ఈ ఏడాదిలోనే ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూడతామని తెలిపారు. నక్షత్రం చూసుకుని అన్నకు రాఖీ కడితే చెట్ల పెంపకానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లో రూఫ్ టాప్ గార్డెన్ లేదా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చేపలు, చికెన్, ఇళ్లలో నుంచి వచ్చే వేస్ట్‌తో రీసైక్లింగ్‌కు ఉపయోగిస్తామన్నారు. నల్లమల అడవుల్లో విలువైన మూలికలు ఉన్నాయన్నారు. ఎర్రచందనంతో పాటు నల్లమల అడవులలో ఉన్న వనమూలికలనూ కాపాడుకోవాలని చెప్పుకొచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని.. వచ్చే మూడేళ్లలో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు వస్తున్నాయన్నారు. వచ్చే ఏడాది నాటికి పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధిస్తామన్నారు. 175 నియోజక వర్గాల్లో నగర వనాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## ఏపీలో అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్స్ స్టవ్‌లు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు 55,000 ఇండక్స్ స్టవ్‌లు, నాలుగు స్టీల్ పాత్రల చొప్పన పంపిణీ చేస్తున్నామని.. దీనివల్ల అంగన్‌వాడీ నిర్వహణలో 30 శాతం ఖర్చులు తగ్గుతున్నాయని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్స వం సందర్భంగా మంత్రి ఫన్ టైమ్స్ క్లబ్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల కోసం ఆట బొమ్మలు, మంచినీటి సదుపాయం, టాయిలెట్ శుభ్రత, కొత్త టీవీ కొనుగోలు కోసం రూ. 1 లక్ష నిధుల విడుదల చేసినట్లు చెప్పారు. మినీ అం గన్‌వాడీలను పూర్తి స్థాయి అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిపాదన చేశామన్నారు. పిల్లల ఆరోగ్యమే ధ్యేయంగా పౌష్టికాహారం, రోజూ గుడ్డు, పాలు అందిస్తున్నామని తెలిపారు. పాలు ఇరిగిపోతున్నాయన్న ఫిర్యాదులపై పాల పౌడర్లు అందించడం ప్రారంభించామని తెలిపారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. 'మా బిడ్డల్ని ఎలా చూసుకోవాలో మా ప్రభుత్వానికే తెలుసు' అంటూ మహిళల భద్రత కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.

**11,400 మందికి ఈరోజే ఇండక్స్ స్టవ్‌ల పంపిణీ..**

11,400 మందికి ఈరోజే ఇండక్స్ స్టవ్‌లు పంపిణీ చేసామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. అంగన్‌వాడీలకు సోలార్ పవర్ ఏర్పాటు కోసం కేంద్రానికి ప్రతిపాదన పంపామని.. త్వరలో ఆమోదం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారని ఎంపీ కేశినేని చిన్ని చెప్పారు. అలాగే రూ.




845 కోట్లతో విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి జరుగుతుందని, రైల్వే స్టేషన్‌కు సంబంధించిన సరికొత్త డిజైన్లు విడుదల చేశామని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. ఒకేసారి 20 వేల మంది ప్రయాణికులు వచ్చి వెళ్లేలా సౌకర్యాలు కల్పిస్తూ ఏర్పాట్లు చేస్తున్నామని, ఆధునికీకరణకు నీతి ఆయోగ్ ఆమోదం లభించిందని, 2 నెలల్లో అనుమతులు వస్తాయన్నారు. ఇటీవల కేటగిరి-1లోకి విజయవాడ రైల్వే స్టేషన్ చేరిందని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు.

**అంగన్వాడీ కేంద్రాలకు త్వరలో టీచర్లు..**

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్ల నియామకం త్వరలో చేపట్టనున్నామని చెప్పారు. చిన్ననాటి నుంచే మానవీయ విలువలతో కూడిన విద్యా బోధన అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలను ఆహ్లాదకర వాతావరణం కలిగినవిగా అభివృద్ధి చేస్తున్నామని, పచ్చదనం, ఆట వస్తువులతో పార్క్ మాదిరిగా రూపాంతరం చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు పేర్కొన్నారు.

## శర్మిష్ఠ పనోలికి మధ్యంతర బెయిల్

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేసిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలికి కోల్‌కతా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. రూ. 10,000 పూచీకత్తు (బెయిల్ బాండ్) సమర్పించాలని ఈ సందర్భంగా కోర్టు ఆదేశించింది. 'లా' విద్యార్థిని అయిన 22 ఏళ్ల శర్మిష్ఠని కోల్‌కతా పోలీసులు గత వారం గుర్గాంలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఆమెను కోల్‌కతా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ వారం ప్రారంభంలో కోర్టు పనోలికి మధ్యంతర బెయిల్ నిరాకరించింది. 'చూడండి, మనకు వాక్ స్వాతం త్ర్యం ఉంది. కానీ దాని అర్థం మీరు ఇతరులను బాధపెట్టడానికి కాదు. మన దేశం వైవిధ్యమైనది, వివిధ కులాలు, మతాలు, మతా లకు చెందిన వ్యక్తుల గురించి వ్యాఖ్యలు చేసేప్పుడు మనం జాగ్రత్తగా ఉండాలి'. అని జస్టిస్ పార్థసారథి ఛటర్జీ అన్నారు. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో శర్మిష్ఠపై దాఖలైన ఫిర్యాదులో ఎటువంటి నేర ప్రవృత్తి లేదని పనోలి తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ఇండియా-పాకిస్థాన్ అంతటా సోషల్ మీడియాలో మాటల యుద్ధం జరిగిందని.. వీరిలో ఎక్కువమంది పర్యాటకులని ఆయన కోర్టుకు తెలియచెప్పే ప్రయత్నం చేశారు. ఇలా ఉండగా, పనోలి అరెస్టు పశ్చిమ బెంగాల్ తోపాటు, యావత్ దేశంలో రాజకీయ వివాదానికి దారి తీసింది. బెంగాల్‌లో ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శర్మిష్ఠ పనోలి అరెస్టును "సెలెక్టివ్ ఎన్‌ఫోర్స్‌మెంట్"గా అభివర్ణించింది. అంతేకాదు, కోల్‌కతా పోలీసులు తొందరపాటుతో వ్యవహరించారని ఆరోపించింది. అటు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా శర్మిష్ఠ అరెస్టును తీవ్రంగా ఖండిం చారు. ఈ సందర్భంగా తాను శర్మిష్ఠకు అండగా ఉంటానని కూడా ఆయన వ్యాఖ్యానించారు.




## పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తాం : పవన్ కల్యాణ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** కోటి మొక్కలు నాటి.. వాటిని సంరక్షించడమే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అడవిలో కార్చిచుల నివారణకు, పర్యా వరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని అన్నారు. మానవ జీవితంలో ప్రకృతికి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. ఒకప్పుడు ఇంటి చిరునామాకు మొక్కలు, చెట్లు ఆనవాళ్లుగా ఉన్నాయని వెల్లడించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు కానీ, ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సీఎంగా ఉన్నారని ఉద్ఘాటించారు పవన్ కల్యాణ్. పర్యావరణ పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపుని చ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇవాళ (గురువారం) అనంతవరంలోని ఏడీసీఎల్ పార్క్‌లో వనమహోత్స వం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, మంత్రులు, హాజరయ్యారు. అనంతవరం పార్క్ సమీపంలో రాగి, వేప మొక్కలను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాటారు. ప్రజాప్ర తినిధులు, అధికారులు కోటి మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేష్, ప్రజాప్రతి నిధులు, అధికారులు ప్రమాణం చేశారు.

## జగన్ ప్రభుత్వంలో డిసీసీబిల్లో భారీగా అవినీతి



**గుంటూరు జిల్లా, (రాజధాని వార్తలు):** గత జగన్ ప్రభుత్వంలోని ఐదేళ్లు డీసీసీబీలని అవినీతిలో కురుకుపోయేలా చేశారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. గుంటూరు, విజయవాడ డీసీసీబీల్లో భారీగా అవినీతికి పాల్పడ్డారని షాకింగ్ కామెంట్స్ చేశారు. కూటమి ప్రభుత్వంలో డీసీసీబీల్లో అవినీతిపై హౌస్ కమిటీ నియమించి విచారణ చేయిస్తున్నామని చెప్పారు. నకిలీ పాస్ పుస్తకాలతో అక్రమంగా కోట్ల రుణాలు తీసుకున్నారని మండిపడ్డారు. వారందరిపై విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు మంత్రి అచ్చెన్నాయుడు. ఇవాళ (గురువారం) గుంటూరు జిల్లా సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా మక్కెన మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రైతులకు మేలు చేయాలని సహకార వ్యవస్థ తీసుకొచ్చారని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు సహకార వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై చర్చించారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలోని ఐదేళ్లు ఎన్నిక లేదు.. ఆడిట్ లేకపోవడంతో పెద్దఎత్తులో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. సహకార వ్యవస్థను గాడిలో పెట్టాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని తెలిపారు. బ్యాంక్ చైర్మన్‌ను నియమిస్తున్నామని.. త్వరలో సంఘాల సభ్యులను కూడా నియమిస్తామని ప్రకటించారు. గత జగన్ ప్రభుత్వంలో సభ్యత్వ నమోదులోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు మంత్రి అచ్చెన్నాయుడు. డీసీసీబీల్లో అక్రమాలకు చెక్ పెట్టేలా సంఘాలను కంప్యూటరీకరణ చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఇప్పటికే 98 శాతం కంప్యూటరీకరణ పూర్తి చేశామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. జూన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ లావాదేవీలపై విచారణ చేయాలని ఆదేశించామని చెప్పారు. రైతులకు ఖరీఫ్‌లో రుణాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. కౌలు రైతులకు నూరు శాతం రుణాలు ఇస్తామని మాటిచ్చారు. డీసీసీబీకి ఉన్న చెడ్డ పేరు తొలగిపోయేలా రైతులకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నల్లబర్లి పొగాకుపై సీఎం చంద్రబాబు సమీక్షించారని అన్నారు. గత ఏడాది కంటే మూడు రెట్లు అధికంగా దిగుమతి వచ్చిందని చెప్పారు. రైతులు నల్లబర్లి పొగాకుని భవిష్యత్తులో వేయొద్దని కంపెనీలు కోరుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండల కేంద్రంలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో ఎంపి మిథున్ రెడ్డి, గురుమూర్తి, తరలి వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలసి ర్యాలీగా వెళ్లి, ఎమ్మార్వోకు వినతిపత్రం అందించిన మాజీ మంత్రివ ర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా.కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపట్టాము. ఏడాదిగా ప్రజలకు జరిగిన అన్యాయానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహించాము. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో అనేక హామీలు ఇచ్చి, సంవత్సరం రోజులైనా ఏ ఒక్క హామీ అమలు చేయకుండా, ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తుంది. ప్రజల కోసం పోరాడే వ్యక్తులను టార్గెట్ చేస్తూ, వాళ్ల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుంది. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజల కోసం నిలబడే వ్యక్తులను ఇబ్బందులు గురి చేస్తున్నారు. తరలి వచ్చినారు. ఈ జనాన్ని చూస్తేనే, కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఎంత అసంతృప్తి ఉందో అర్థమవుతుంది. సర్వేపల్లిలో వెన్నుపోటు దినం నిరసన




కార్యక్రమం సర్వేపల్లిలో మా నాయకుడు గోవర్ధన్ రెడ్డి లేకుండా నిర్వహించుకోవడం బాధాకరం. కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల కోసం రాష్ట్ర శాంతి భద్రతల కోసం పోరాటం చేశారు. ప్రజల కోసం పోరాడే వ్యక్తులను అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపడం ప్రజలకు అన్యాయం చేసినట్లే గోవర్ధన్ రెడ్డి గళం నొక్కాలని చూస్తే, నేడు వేలాదిమంది తమ గళం విప్పేందుకు ఇక్కడకు తరలి వచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తే, ప్రజల కోసం గోవర్ధన్ రెడ్డి మాట్లాడేవారు కాదు కదా ప్రజల కోసం పనిచేయండి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి. ఏడాది కాలంగా ప్రజలకు అందించాల్సిన పథకాలను బకాయిలతో సహా అమలు చెయ్యండి. శాంతియుతంగా ప్రజల కోసం ర్యాలీ నిర్వహిస్తుంటే ప్రభుత్వం అడ్డుకుంటుంది. ప్రజలకు జరిగిన అన్యాయాన్ని తెలియకుండా చేయాలనే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తుంది. ఇలాంటి చర్యలను ఆపి, ప్రజలకు మంచి చేయాలని కోరుతున్నాం. పెద్దలు పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి, గురుమూర్తి మా కుటుం బానికి అండగా నిలబడటం ధైర్యాన్ని ఇచ్చినట్లుంది. నాన్న జైల్లో ఉన్నా, జగనన్నపై అభిమానంతో, నాన్నపై నమ్మకంతో ప్రజలు తరలి వచ్చి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క సర్వేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, నాన్న అభి మానులకు, ప్రజలకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. యం.పి. మిథున్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం అవుతున్న ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్‌ను నెరవేర్చలేదు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయించాలని వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపట్టాము. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వ్యక్తులపై తప్పుడు కేసులు పెట్టి, జైళ్లకు పంపుతున్నారు. పరిపాలనను గాలికి వదిలేసి వేధింపులు అక్రమ కేసులు పెడుతూ, కూటమి ప్రభుత్వం బిజీబిజీగా ఉంది. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపినా, గోవర్ధన్ రెడ్డి కుమార్తె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌కు అండగా నిలబడటం అభినందనీయం. జగన్మోహన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు నెల్లూరు రానున్నారు. ప్రజలకు మేలు జరిగే విధంగా తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరుతున్నాము. యం.పి. గురుమూర్తి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం నీకు 15 వేలు, నీకు 18 వేలు అంటూ ప్రజలను మభ్య పెట్టింది. కూటమి రోజున ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచింది. ప్రజల కోసం గళం వినిపించే, కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపి, ఆయన గళం నొక్కాలని కూటమి ప్రభుత్వం కుట్ర చేసింది. న్యాయస్థానాలపై మాకు నమ్మకం ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుగా నిలబడుతుంది. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా అమలు చేయని ప్రతి పథకాన్ని ప్రజలకు అందించాలి. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట కోసం నిలబడే వ్యక్తి కరోనాలాంటి విపత్కర సమయంలో కూడా ప్రజలకు పథకాలను అందించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దొంగల పార్టీగా మారిపోయిన వైసీపీ : ఎమ్మెల్యే సోమిరెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** 2024 జూన్ 4...ఏపీ ప్రజలకు స్వాతంత్ర్యం లభించిన రోజు అని, వైసీపీ పాలనలో దళిత బిడ్డలను బలితీసుకుని ఇప్పుడు రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్‌లకు పరామర్శలా..వచ్చే ఎన్నికల్లో గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లకు వైసీపీ ప్రత్యేక ప్రాధాన్యమిస్తుందంట మరోసారి వెన్నుపోటు అంటే...వైసీపీకి ప్రజలే పోటు పొడిచేస్తారు అని నెల్లూరు రైల్వే కోర్టు ఆవరణలో మీడియాతో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. కృష్ణపట్నం ఆనందయ్య ఆయుర్వేదం మందు విషయంలో బనాయించిన అక్రమ కేసుకు సంబంధించి కోర్టుకు సోమిరెడ్డి హాజరయ్యారు. 2019-24 మధ్య వైసీపీ చేసిన అరాచకాల కారణంగా నాపై బనాయించిన ఓ తప్పుడు కేసుకు సంబంధించి ఈ రోజు హైకోర్టుకు హాజరయ్యాను. జగన్మోహన్ రెడ్డి పాలనలో నాపై 18 అక్రమ కేసులు బనాయించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి సీఎంలుగా ఉన్నప్పుడు నాపై కేసులు పెట్టలేదు. ఆనం కుటుంబం ప్రత్యర్థులుగా ఉన్నప్పుడూ నాపై కేసులు లేవు. ఈ రోజు ఒక కేసుకు ముద్దాయిగా చేతులు కట్టుకుని కోర్టులో నిలుచున్నాను. న్యాయస్థానాలపై నాకు పూర్తి నమ్మకముంది. పైన భగవం తుడున్నాడు. జగన్ రెడ్డి పార్టీ ఈ రోజు వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదం వెన్నుపోటు అనే పేరు ఎత్తే అర్హతే జగన్మోహన్ రెడ్డికి గానీ, ఆయన పార్టీకి కాని లేదు.తండ్రి కాంగ్రెస్ పార్టీలో సీఎంగా ఉన్నప్పుడు రూ.43 వేల కోట్ల అవినీతికి పాల్పడిన ముద్దాయి జగన్మోహన్ రెడ్డి. ఒక సీఎం కుమారుడిగా రూ.43 వేల కోట్ల కుంభకోణంతో సీబీఐ చేతిలో బుక్ అయినవారు మరొకరు లేరు. రూ.43 వేలు కోట్లు దోచుకున్న తర్వాత కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి, వైసీపీ పెట్టాడు. ఒక్క ఛాన్స్ ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి ఏపీ ప్రజలకు వెన్నుపోటు పొడిచాడు.కల్తీ మద్యం పోసి వేలాది మంది ప్రాణాలు బలితీసుకున్నాడు..లక్షల మందిని మంచానికి పరిమితం చేశాడు సిట్ విచారణలో ఇప్పటి వరకు లిక్కర్ స్కామ్ రూ.3,200 కోట్లు అని తేల్చారు.దేశాన్ని కుదిపేసి కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసిన బోఫోర్స్ స్కామ్ విలువ రూ.60 కోట్లు, 2జీ స్కామ్ విలువ వందల కోట్లు జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు రూ.43 వేల కోట్లు, ఇప్పుడు వైసీపీలోనూ వేలాది కోట్లు లిక్కర్ స్కామ్‌లో అనధికారికంగా జరిగిన సేల్స్ వివరాలు తీస్తే, ఎన్ని వేల కోట్ల కుంభకోణం బయటపడుతుందో ప్రజలు నమ్మి ఒక్క ఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు జగన్ రెడ్డి. చివరకు గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లను పరామర్శించి ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నాడో.. కానిస్టేబుల్‌ను చంపేందుకు




ప్రయత్నించిన రౌడీషీటర్లను పోలీసులు కొడితే తెగ గింజుకుంటున్నాడు. సొంత పార్టీ ఎంపీ రఘురామకృష్ణంరాజును పోలీసులతో 121 దెబ్బలు కొట్టించి వీడియో కాల్‌లో చూసి ఆనందించిన సైకో జగన్మోహన్ రెడ్డి అలాంటి వ్యక్తి వెన్నుపోటు దినోత్సవం అనడం చూసి ప్రజలే నవ్వుకుంటున్నారు. వైసీపీ పేరు మార్చేసి దొంగల పార్టీ అని పెట్టుకోవాలని హితవు పలుకుతున్నాను. వచ్చే ఎన్నికల్లో గంజాయి బ్యాచ్‌కు, రౌడీషీటర్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని వైసీపీలో చర్చ జరుగుతోందంట.కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను కొట్టిచంపిన రోజు. ఈ జగన్మోహన్ రెడ్డి ఎక్కడున్నాడు. దళితుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చంపి కారులో డోర్ డెలివరీ చేస్తే జగన్మోహన్ రెడ్డి ఏం చర్యలు తీసుకున్నాడు.నెల్లూరులో దళిత సోదరుడు ఉదయగిరి నారాయణను లాకప్ డెత్ చేసి 40 మంది పోలీసులు వెళ్లి బలవంతంగా తగలబెట్టించిన రోజు జగన్ రెడ్డి ఏం చేస్తున్నాడు. కావలిలో వైసీపీ నేతల దుర్మార్గాలతో బతకలేక చచ్చిపోతున్నానని దళితుడు కరుణాకర్ ఆత్మహత్య చేసుకుంటే బాధిత కుటుంబాన్ని పరామర్శించాడా వైసీపీ అరాచకాలతో ప్రాణాలు పోగొట్టుకున్న వారి కుటుంబ సభ్యులను కనీసం పలకరించకుండా..ఈ రోజు రౌడీషీటర్లను, గంజాయి బ్యాచ్‌ల పరామర్శకు వెళ్లడం జగన్ రెడ్డి ఉద్దేశాన్ని చెబుతోంది. అలాంటి జగన్మోహన్ రెడ్డి ఈ రోజు వెన్నుపోటు దినం చేస్తుండటం విడ్డూరంగా ఉంది. 2024 జూన్ 4న ఏపీ ప్రజలకు స్వాతంత్ర్యం లభించింది. వైసీపీ దురాగతాల నుంచి విముక్తి లభించిన రోజు ఇది. వైసీపీ పాలనలో చచ్చిపోయిన ప్రజాస్వామ్యాన్ని, సర్వనాశమైన రాష్ట్రాన్ని నరేంద్ర మోదీ సహకారంతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ గాడిలో పెడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి కానీ, ఆయన పార్టీ కానీ మరోసారి వెన్నుపోటు అంటే వాళ్లకు ప్రజలే పోటు పొడిచేస్తారు.

# ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచి నేటికీ ఏడాది

## - నాడు చెప్పిన హామీలన్నీ అమలు చేస్తానంటూ...నేడు ఏమీ చేయలేనంటూ చేతులెత్తేసిన కూటమి సర్కార్ : మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి








**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టడం కోసం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో నేడు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు నిర్వహించారు. అనం తరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి ఆర్.డి.ఓ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ శాంతికి అర్జీ ఇచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టడం లక్ష్యంగా చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలను గుప్పించారన్నారు. సూపర్ సిక్స్ అంటూ బూటకపు మేనిఫెస్టోను తీసుకు వచ్చారని, చివరికి అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి ఆర్థిక స్థితి బాగోలేదంటూ మానిఫెస్టోను మూలన పడేశారని ఎద్దేవా చేశారు. అభివృద్ధిని అటకెక్కించే సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ప్రధానంగా మహిళా శక్తి పేరుతో ఆడపడుచులకు ఇచ్చిన హామీలను తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు వంటి పథకాలను ఇస్తానని అక్క చెల్లెమ్మలకు వెన్నుపోటు పొడిచాడని ధ్వజమెత్తారు. అలాగే చదువుకుంటున్న పిల్లలను మభ్యపెడుతూ ఎన్నికల సమయంలో నీకు 15 వేలు, నీకు 18 వేలు అంటూ ప్రగల్బాలు పలికిన కూటమి నేతలు నేడు వారికి వెన్నుపోటు పొడిచారన్నారు. దీపం-2 అంటూ ఉచిత గ్యాస్ అంటూ మధ్యతరగతి మహిళలకు వెన్నుపోటు పొడిచారని, ప్రభుత్వాలు తప్పు చేసినా, సామాన్య ప్రజలకు అన్యాయం జరిగిన స్పందించి ప్రశ్నిస్తానన్నా పవన్ కళ్యాణ్ ఏమయ్యారు?. కూటమి ప్రభుత్వం పాలన ఏడాది గడుస్తున్నా ప్రజలకు చిల్లి గవ్వ చేతికిందలేదన్నారు. ప్రజల పక్షాన నిలుస్తున్న వారిపై దాడులు, దౌర్జన్యాలు కేసులు అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. శ్రీకాళహస్తిలో ఇసుక మాఫియా విపరీతంగా పెరిగిపోయి ఉచిత ఇసుక అంటూ ఊదర గొట్టి పచ్చమూకకు ప్రకృతి వనరులను అప్పగించేశారని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించ్చారు. సిసి రోడ్లు, భవనాలు, పంచాయతీ పనులు, ఆర్ అండ్ బి,గనుల కాంట్రాక్టు వంటి పనులను తెలుగు తమ్ముళ్లకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారని దుయ్యపట్టారు. శ్రీకాళహస్తిలో ఎప్పుడూ లేనివిధంగా కొత్త రాజకీయాన్ని తెరదీశారన్నారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఎన్నికల వరకే ప్రత్యర్థులుగా చూసే వాళ్ళమని, ఆ తర్వాత ప్రతి ఒక్కరికి పనిచేసి అందరూ బాగుండాలని కోరుకున్నా మన్నారు. కానీ నేడు శ్రీకాళహస్తిలో ఆ పరిస్థితి లేదని, ఇలాగే ఓ నూతన వరవడికి శ్రీకారం చుడితే రేపు అధికారంలోకి వచ్చేది మేమే అప్పుడు నేను చెప్పినా కూడా మా కార్యకర్తలు నా మాట వినే పరిస్థితి ఉండకపోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వయ్యాల కృష్ణారెడ్డి, ఓడూరు గిరిధర్ రెడ్డి, బ్రి సుదర్శన్ రెడ్డి, గున్నేరి కిషోర్ రెడ్డి, కూనాటి రమణయ్య యాదవ్, గంగారి రమేష్, చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, పగడాల రాజు, ప్రభాకర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమీక్షా సమావేశం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు అధ్యక్షతన శ్రీకాళహస్తి నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు బాలగురువం బాబు మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాలను, ప్రజా సమస్యలపై ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి, ఏ విధంగా పోరాడాలని దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పనిచేయాలని తెలియజేశారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, పేదల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేద బడుగు బలహీన వర్గాల వారు అభివృద్ధి చెందాలంటే అది ఒక కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈనాడు భారతదేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందంటే నాడు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన విధి విధానాలేనని, కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షుడు నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంటోనీ, కరీముల్లా, పఠాన్ అల్తాఫ్, షేక్ బబ్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బంగారమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన బొజ్జల బృందమ్మ



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ శ్రీ బంగారమ్మ జాతర మహోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు మాతృమూర్తి బొజ్జల బృందమ్మ శ్రీ బంగారమ్మకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తెలుగుదేశం మహిళా నేతలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# టిడిపి యువ నాయకుడు ఎస్సీవి దిలీప్‌కు ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని బంగారమ్మ గ్రామ దేవత జాతర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తనయుడు, టిడిపి యువ నాయకుడు ఎస్సీవి దిలీప్ నాయుడుకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారికి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సుదర్శన్ నాయుడు, ఢిల్లీ ప్రతాప్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# టింబర్ డిపోలో ప్రభాస్ పోరాటం



ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను చేస్తున్నాడు. కానీ అభిమానుల టైం బాగా లేకపోవడంతో అవి ఏవో కారణాల వల్ల ఆలస్యం అవుతూ ఉన్నాయి. ప్రభాస్, మారుతి కాంబోలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమా మొన్న ఏప్రిల్‌లోనే విడుదల కావాల్సి ఉన్న విషయం తెల్సిందే. కానీ సినిమా ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఇటీవలే ఈ ఏడాది చివర్లో సినిమాను విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటన చేశారు. ప్రస్తుతం ప్రభాస్ రాజాసాబ్ సినిమాను పక్కన పెట్టి ఫౌజీ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను ఇదే ఏడాదిలో విడుదల చేయాలని ప్రారంభించే సమయంలో అనుకున్నారు. కానీ అది కూడా సాధ్యం అయ్యేలా లేదు. ప్రస్తుతం ప్రభాస్ రామోజీ ఫిల్మ్ సిటీలో ఫౌజీ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన టింబర్ డిపో సెట్‌లో ప్రభాస్ భారీ యాక్షన్ సీన్స్‌లో నటిస్తున్నాడు. విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియంటెడ్ మూవీగా ఈ సినిమాను హను రాఘవపూడి రూపొందిస్తున్నాడు. ఆయన గత చిత్రాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమా సెన్స్‌బుల్‌గా ఉంటుందని, అంతే కాకుండా మెచ్యూర్డ్ లవ్ స్టోరీని కలిగి ఉంటుంది అంటూ చిత్ర యూనిట్ సభ్యులు చాలా నమ్మకంగా చెప్పుకొచ్చారు. ఆకట్టుకునే కథ, కథనంతో దర్శకుడు హను రాఘవపూడి రూపొందిస్తున్న ఫౌజీ సినిమా షూటింగ్ దాదాపుగా సగం పూర్తి అయిందని తెలుస్తోంది. సినిమా షూటింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి వర్కింగ్ టైటిల్‌గా ఫౌజీ కొనసాగుతూ వస్తుంది. అయితే ప్రధాన టైటిల్ మాత్రం ఇది కాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. హను రాఘవపూడి సినిమాలన్నింటికి విభిన్నమైన టైటిల్‌ను పెడుతూ ఉంటాడు. కనుక ఈ సినిమాకు సైతం అదే తరహాలో విభిన్నమైన టైటిల్‌ను షూటింగ్ పూర్తి అయిన తర్వాత ఖరారు చేస్తాడేమో చూడాలి. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇన్‌స్టాగ్రామ్ స్టార్‌గా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ ఇమాన్వి నటిస్తోంది. ఆ మధ్య ఈమెను కొందరు పాకిస్తానీ అంటూ విమర్శించడంతో సినిమా విషయమై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఇమాన్వికి పాకిస్తాన్‌కి ఎలాంటి సంబంధం లేదని ఆ తర్వాత తేలిపోయింది. ఇమాన్వి ఆ విషయాన్ని స్వయంగా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. హీరోయిన్‌గా ఇమాన్వి ఫౌజీ తో ఎంట్రీ ఇవ్వబోతుంది. మొదటి సినిమానే ప్రభాస్‌తో చేస్తున్న నేపథ్యంలో ఇమాన్వి రాబోయే రోజుల్లో ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో వెలుగు వెలగడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అతి త్వరలోనే ఈ సినిమాను పూర్తి చేస్తారని తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ కొన్ని కారణాల వల్ల ఆలస్య అవుతున్న కారణంగా ఈ ఏడాదిలోనే విడుదల చేయాలని అనుకున్న ఈ సినిమాను కాస్త వచ్చే ఏడాది సమ్మర్‌కి వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీ విషయంలో క్లారిటీ వస్తుందేమో చూడాలి.

# చిరు-అనిల్ మూవీ ఏం జరుగుతుందంటే..!



మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో రూపొందుతున్న సినిమా షూటింగ్ గత నెలలో ప్రారంభం అయింది. మొదటి షెడ్యూల్ పూర్తి చేసిన మేకర్స్ రెండో షెడ్యూల్‌కి కాస్త సమయం తీసుకుంటారని అంతా భావించారు. చిరంజీవి వయసు రీత్యా, ఇతర కారణాలతో బిజీగా ఉండటం వల్ల షెడ్యూల్‌కి షెడ్యూల్‌కి ఎక్కువ గ్యాప్ తీసుకుంటారు అనే అభిప్రాయం ఉంది. కానీ అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్న సినిమా విషయంలో చిరంజీవి అవిశ్రాంతంగా సినిమాను చేస్తున్నట్లు తెలుస్తోంది. మొదటి షెడ్యూల్ పూర్తి అయిందో లేదో అప్పుడే తదుపరి షెడ్యూల్‌కి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. త్వరలోనే రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభం కాబోతుంది. చిత్ర యూనిట్ సభ్యుల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం జూన్ 7 నుంచి ఈ సినిమా రెండో షెడ్యూల్ ప్రారంభం కాబోతుంది. మొదటి షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో నిర్వహించిన మేకర్స్ ఈసారి డెహ్రాడూన్.. ముస్సోరిలో ప్లాన్ చేసినట్లు సమాచారం అందుతోంది. అక్కడ దాదాపుగా 10 నుంచి 12 రోజుల షూటింగ్ జరగనుంది. వాతావరణం అనుకూలిస్తున్న ఈ సమయంలో అక్కడి షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు. మరికొన్ని రోజుల తర్వాత అక్కడి వాతావరణం ఇబ్బందికరంగా మారుతుంది అనే ఉద్దేశంతో ఈ షెడ్యూల్‌ను ముందుగానే పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. చిరంజీవితో పాటు నయనతార కూడా ఆ షెడ్యూల్‌లో జాయిన్ కాబోతున్నారు. అనిల్ రావిపూడి గత చిత్రం సంక్రాంతికి వస్తున్నాం భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. వెంకటేష్ కెరీర్‌లోనే కాకుండా తెలుగు సినిమా చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సొంతం చేసుకున్న ప్రాంతీయ సినిమాగా నిలిచింది. పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కాకుండా కేవలం తెలుగులో మాత్రమే విడుదల అయిన సంక్రాంతికి వస్తున్నాం సాధించిన వసూళ్లు చూస్తే పాన్ ఇండియా సినిమాలు సైతం చిన్నబోవాల్సిందే. ఆ స్థాయిలో వసూళ్లు దక్కించుకున్న సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత అనిల్ రావిపూడి నుంచి సినిమా అనగానే అంచనాలు అదే స్థాయిలో ఉంటాయి. అందుకే చిరంజీవితో చేయబోతున్న సినిమా విషయంలో ఏమాత్రం అశ్రద్ధ లేకుండా అనిల్ రావిపూడి జాగ్రత్తగా ఉన్నాడు. మెగాస్టార్ చిరంజీవి ఇప్పటికే విశ్వంభర సినిమాను ముగించాడు. ఒకటి రెండు రోజుల ప్యాచ్ వర్క్ మాత్రమే బ్యాలన్స్ ఉందని మేకర్స్ అంటున్నారు. ఇంకా ఏమైనా మార్పులు ఉన్నా వారం రోజుల్లో విశ్వంభర సినిమా షూటింగ్ పూర్తి చేస్తారు. అయితే వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ సినిమా అనూహ్య కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఈ ఏడాది చివరి వరకు అయినా సినిమా విడుదల అయ్యేనా అంటూ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. భారీ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న విశ్వంభర సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. మరో నలుగురు ముద్దుగుమ్మలు కీలక పాత్రలో కనిపించబోతున్నారు. విశ్వంభర సినిమా విడుదలైన వెంటనే చిరు-అనిల్ మూవీ విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# రామ్‌కు '6' ఆఫర్స్.. నెక్ట్స్ ఎవరితో మరి?




టాలీవుడ్ యంగ్ హీరో రామ్ పోతినేనికి ఎలాంటి క్రేజ్ అందరికీ తెలిసిందే. వర్సటైల్ యాక్టర్‌గా మంచి గుర్తింపు సంపాదించుకున్న ఆయన.. క్యారెక్టర్లు, లుక్స్ పరంగా ఎప్పటికప్పుడు డిఫరెన్స్ చూపిస్తుంటారు. విభిన్నమైన కథలు ఎంచుకుంటూ సినిమాలు చేస్తూ ఆడియన్స్‌ను అలరిస్తుంటారు. వరుస సినిమాలతో సందడి చేస్తుంటారు. మూవీ రిజల్ట్‌తో ఎలాంటి సంబంధం లేకుండా సినిమాల్లో నటిస్తున్న రామ్.. చివరగా డబుల్ ఇస్మార్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఆ మూవీతో భారీ విజయం అందుకుంటారని అంతా అంచనా వేశారు. కానీ అనుకున్నట్లు జరగలేదు. బాక్సాఫీస్ వద్ద డబుల్ ఇస్మార్ట్ మూవీతో అందరినీ నిరాశపరిచారు. అలా సరైన హిట్ కోసం కొంతకాలం వెయిట్ చేస్తున్న హీరో రామ్.. ఇప్పుడు తన మార్గాన్ని మార్చుకున్నారని క్లియర్‌గా తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ పి.మహేష్‌తో ఆంధ్ర కింగ్ తాలూకా మూవీని చేస్తున్నారు. శరవేగంగా సినిమా షూటింగ్ జరుగుతుండగా.. త్వరలోనే చిత్రీకరణ పూర్తి అవ్వనున్నట్లు సమాచారం. రీసెంట్‌గా మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్స్‌కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. మూవీపై పాజిటివ్ బజ్ కూడా క్రియేట్ అయింది. త్వరలోనే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అదంతా ఓకే అయినా.. రామ్ నెక్ట్స్ మూవీ ఏంటన్నది క్లారిటీ లేదు.

తన తదుపరి సినిమాను ఇప్పటి వరకు రామ్ అనౌన్స్ చేయలేదు. సంతకం కూడా చేయలేదు. ప్రస్తుతం కొందరు యువ దర్శకులు రామ్‌తో చర్చలు జరుపు తున్నట్లు తెలుస్తోంది. ఏకంగా ఆరుగురు యంగ్ డైరెక్టర్స్.. రామ్ కోసం స్క్రిప్ట్‌లపై వర్క్ చేస్తున్నారని సమాచారం.

మరికొద్ది రోజుల్లో తాము రాసుకున్న కథపై రామ్‌తో డిస్కస్ చేయనున్నారని వినికిడి. దీంతో ఇప్పుడు ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెవ్వర్ బిఫోర్ అనేలా.. రామ్‌కు ఇప్పుడు ఆఫర్స్ వస్తున్నట్లు క్లియర్‌గా తెలుస్తోంది. డిమాండ్ ఫుల్‌గా ఉందని అర్థమవుతోంది. అయితే రామ్.. ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా ఆయనకు ఇప్పుడు సరైన హిట్ కావాల్సిందే. మరి ఆ ఆరుగురు యువ దర్శకుల్లో ఎవరు ఛాన్స్ అందుకుంటారో వేచి చూడాలి.


# అనుష్క హోర్డింగ్ కారణంగా 40 యాక్సిడెంట్స్



అల్లు అర్జున్, మంచు మనోజ్, అనుష్క ముఖ్య పాత్రల్లో నటించిన 'వేదం' సినిమా విడుదల అయ్యి 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. క్రిష్ దర్శకత్వంలో రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చిన వేదం సినిమా విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. థియేట్రికల్ రిలీజ్‌తో ఆశించిన స్థాయిలో కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. కానీ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్, శాటిలైట్ టెలికాస్ట్‌లో మాత్రం మంచి స్పందన దక్కించుకుంది. వేదం సినిమాను ఎంతో మంది చూశారు, ఇంకా చూస్తూనే ఉంటారు. అల్లు అర్జున్ పాత్రతో పాటు అనుష్క పాత్రలు ప్రేక్షకులను అంత ఈజీగా వదిలి పెట్టవు. అనుష్క అలాంటి రోల్ చేయడం గొప్ప విషయం. హీరోయిన్‌గా అప్పుడే కెరీర్‌లో సెటిల్ అవుతున్న ముద్దుగుమ్మ అనుష్కను వేశ్య పాత్రలో క్రిష్ 'వేదం' సినిమాలో చూపించాడు. సినిమాలోని అనుష్క పాత్ర విషయంలో చాలా మంది నెగటివ్ కామెంట్స్ చేశారు. కానీ అనుష్క మాత్రం చాలా నమ్మకంతో వేదం సినిమాను చేసింది. సినిమా విడుదల సమయంలో అనుష్క పోస్టర్స్, హోర్డింగ్స్‌ను ప్రముఖంగా ఏర్పాటు చేయడం జరిగింది. హోర్డింగ్స్‌లో అనుష్క యొక్క చీర కట్టు ఫోటోలను చూపించారు. ముఖ్యంగా ఐకానిక్ ఫోజ్ అయిన అనుష్క పోస్టర్స్ అప్పట్లో సంచలనం సృష్టించాయి. ఇప్పటికీ ఇంటర్నెట్‌లో వేదం అని సెర్చ్ చేస్తే ఎక్కువగా అనుష్క ఎల్లో కలర్ చీర కట్టులో నడుము చూపిస్తూ, చేతిపై సరోజా అని టాటూ వేయించుకున్న ఫోటోలు కనిపిస్తాయి. 'వేదం' సినిమా విడుదల అయ్యి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను కొందరు నెమరువేసుకున్నారు. ముఖ్యంగా పంజాగుట్ట సర్కిల్ వద్ద ఈ సినిమాలోని అనుష్క హోర్డింగ్‌ను పెద్దదిగా ఏర్పాటు చేశారు. ఆ పోస్టర్ రోడ్డుపై వెళ్లే ప్రతి ఒక్కరికీ కనిపించే విధంగా పెట్టడం జరిగిందట. రోడ్డు మీద వెళ్తున్న సమయంలో చాలా మంది ఆ పోస్టర్‌ను చూడటం కోసం ఆగేవారట. కొందరు రన్నింగ్‌లోనే అనుష్క వైపు చూస్తూ అలాగే ఉండి పోయేవారు. దాంతో ఆ హోర్డింగ్‌ను చూస్తూ డ్రైవ్ చేయడం, ఆ పోస్టర్‌ను చూడటం కోసం ఆపిన వారికి మొత్తంగా కలిపి 40 చిన్న పెద్ద యాక్సిడెంట్స్ అయ్యాయి. ప్రాణాలు పోలేదు కానీ చాలా డ్యామేజీ అయితే జరిగిందట. ఆ హోర్డింగ్ రోడ్డు మీద ఉండటంతో ఏకంగా 40 యాక్సిడెంట్స్ అయినట్లు గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు వెంటనే ఆ హోర్డింగ్‌ను తొలగించారట. ఆ స్థాయిలో అప్పట్లో అనుష్క వేదం పోస్టర్ ఉండేది. ఇప్పుడు సోషల్ మీడియా ఎక్కువగా ఉండటం వల్ల ముందు నుంచే పోస్టర్స్ షేర్ చేస్తున్నారు, అవి వైరల్ అవుతున్నాయి. కానీ అప్పట్లో సోషల్ మీడియాలో పోస్టర్స్‌ను పెద్దగా చూసే అవకాశం ఉండేది కాదు. అందుకే అలా హోర్డింగ్‌ను చూస్తూ ఆమె అభిమానులు యాక్సిడెంట్స్‌కు గురి అయ్యారు. వేదం సినిమా 15 ఏళ్ల వేడుకలో ఇంకా చాలా మెమరబుల్ మూమెంట్స్ను చిత్ర యూనిట్ సభ్యులు సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకున్నారు.

# యోగా వల్ల ఆరోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులు నివారణ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.బాలాజీ



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** యోగా వల్ల ఆరోగ్యం బాగుంటుందని ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే మనుషులు రోగాలు బారిన పడకుండా ఆరోగ్యాంగా, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.బాలాజీ అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా గురువారం అనకాపల్లి పట్టణం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటల నుండి 9 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బంది మరియు జిల్లా మలేరి 85 వార్డులో ఘనంగా జరిగిన ప్రపంచ పర్యవరణ దినోత్సవం యా కార్యాలయం సిబ్బంది, జిల్లా లెప్రసీ కార్యాలయం సిబ్బందితో యోగాంధ్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి యోగా గురువుల బి.అప్పారావు, దొర్రం నాయుడు, మంగియ్య పర్యవేక్షణలో యోగాసనలు వెయ్యడం జరిగింది.

అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.బాలాజీ, జిల్లా ఆసుపత్రిల సామాన్యవయా కర్త శ్రీనివాసరావు మరియు జిల్లా జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య ఆధ్వర్యంలో యోగపై అవగాహన ర్యాలీని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి ఎన్.టి.ఆర్, జిల్లా కేంద్ర ఆసుపత్రి వరకు భారీ ర్యాలీ నిర్వహించి యోగాంధ్రపై ప్రజలను చైతన్య పరచడం




జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి శ్రావ్యశ్రీ, అనకాపల్లి ఎన్.ట్.ఆర్. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణరావు, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది మరియు జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు మాడుగులలో మెగా ఉద్యోగ మేళా

## - జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** మాడుగుల నియోజకవర్గం మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో 20 కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదివి 18 నుంచి 35 ఏళ్లలోపు ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు ముందుగా నైపుణ్యం యాప్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు మెగా ఉద్యోగ మేళాకు హాజరు కావాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరములను వెబ్సైట్ https://naipunyam.ap.gov.in/user-registration లో నమోదు చేసుకోగలరని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 81063 27482 నంబరుకు కాల్ చేసి సంప్రదించాలన్నారు.

# హెచ్.ఐ.వి. గురించి అవగాహన

**అచ్యుతాపురం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలు మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో విలేజ్ లెవెల్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీమ్ డి ఆర్ పి ఎస్ గోవిందరావు మాట్లాడుతూ హెచ్.ఐ.వి.మరియు లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి సమాచారాన్ని అందించేందుకు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోంది. జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా జనాభా లో హెచ్ ఐవి మరియు సుఖవ్యాధులు (ఎస్టీ.ఐ.ల గురించి పరిజ్ఞానం, అవగాహన మరియు హెచ్.ఐ.వి. ఉన్నవారి పట్ల వివక్ష తగ్గించేందుకు, ప్రజల్లో అవగాహన కలిగించి తద్వారా ఎక్కువ మంది హెచ్.ఐ.వి.పరీక్షలు చేసుకునేందుకు ముందుకొచ్చేలా నేకో ఆదేశాలకనుగుణంగా, హెచ్ఐవి మరియు ఎయిడ్స్ (ప్రివెన్షన్ కంట్రోల్) యాక్టు-2017 గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం అచ్యుతాపురం మండ




లంలో కొండకర్ల గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ రమ్య హెల్త్ స్టాఫ్ మరియు జోనల్ సూపర్వైజర్ చంద్రశేఖర్ మరియు సిఎల్డబ్ల్యు సరస్వతి, గ్రామస్తులు యూత్ మొదలగువారు పాల్గొనడం జరిగింది.

# 84వ వార్డ్ సిరసపల్లిలో రూ. 30 లక్షలతో సిమెంట్ కాలువ

**విశాఖ, (రాజధాని వార్తలు):** 84వ వార్డ్ సిరసపల్లి గ్రామంలో 30లక్షల రూపాయలతో ఈరోజు ఎస్డబ్ల్యూ కాలువ పనులు ప్రారంభించడం జరిగిందని, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు పాల్గొని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలాబాబు మాట్లాడుతూ శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సీఎం రమేష్ పీలా గోవిందా సహకారంతో మా వార్డులో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని నీలబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన నాయకులు సిరసపల్లి సన్యాసిరావు సిరసపల్లి ప్రసాద్ (జనసేన) కనుమ రెడ్డి గోవింద్ జీవీఎంసీ అధికారులు ఏఈ కుమార్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




# పర్యావరణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ కార్యక్రమం






**విశాఖ, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 85 వార్డ్ డెంకాడ గ్రామంలో జాతీయ రహదారి పక్కన శానిటరీ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు, అనంతరం పర్యావరణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి అని ప్రతిజ్ఞ కార్యక్రమం చేయడం జరిగినది 85 వార్డు కార్పొరేషన్ ఇల్లపు ప్రసాదు మాట్లాడుతూ మానవ జనజీవనంకు విఘాతం కలిగించే కాలుష్యంను నివారించాలంటే మొక్కలు ఇండ్లు దగ్గర పాఠశాలలో దేవాలయాల దగ్గర కమ్యూనిటీ హాల్ వద్ద మొక్కల నాటి పర్యవరణాన్ని కాపాడుతూ సుఖమైన జీవితాన్ని పొందాలని అన్నారు. ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మానవకోటి జనజీవనానికి సంజీవిని లాంటి పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత అందరి పైన ఉందని మన చుట్టూ ఉన్న సహజ మానవ నిర్మాత అంశాలన్నీ కలిసి ఒకే జీవి యొక్క జీవితాన్ని ప్రభావితం చేసే వాతావరణమే పర్యావరణ నేల నీరు గాలి మానవ మనుగుటకు అత్యంత ఆవశ్యకతలో ఈ మూడు ఇప్పుడు కలుషితం అవుతూ ఉండడం భూమ్మీద ఉన్న సకల జీవరాశికి ప్రయాణ సంకటమయింది కావున ప్రతి ఒక్కరూ తమ పరిధిలో మొక్కలు వేసుకొని పరివారాన్ని కాపాడాలని కోరారు. అనంతరం కాలనీ పురవీధుల్లో పరివారాన్ని కాపాడడానికి మొక్కలు పెంచాలి ప్లాస్టిక్ వస్తువులను వాటర్ రాదని స్లొగన్స్ ఇస్తూ ర్యాలీ చేయడం జరిగినది. 85 వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ బి సీతారామయ్య సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 85వ వార్డు టిడిపి నాయకులు గంతకోరు అప్పారావు, కొర్రయి జగదీష్, ఇల్లపు ఈశ్వరరావు, తలారి వెంకట రమణ, గొల్లవిల్లి నూకరాజు, అండబోయిన మంగరాజు, మొల్లి కోటేశ్వరరావు, దామరోతి ప్రసాద్, శ్రీమతి గంతకోరు సత్యవతి బిజెపి నాయకులు కోసూరి తాతారావు, వీ రవీంద్ర కుమార్ 85 వార్డు సచివాలయాల పర్యావరణ శానిటరీ కార్యదర్శిలు సిహెచ్ కనకేశ్వర్ రావు ఎన్ భవాని జై నరేష్ ఎస్ శివ గణేష్ ఎం శ్రీను శానిటరీ సూపర్వైజర్లు సిహెచ్ నాగమణి, భాను మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# చింతపల్లిలో ఎడతెరిపిలేని వర్షం - ప్రజల జీవనం అస్తవ్యస్తం

## - ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన ప్రభావం

## - తీవ్ర ఇబ్బందుల్లో మారుమూల గ్రామాల ప్రజలు

**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం నుండి ఎడతెరిపిలేని వర్షం ప్రజల జీవనానికి తీవ్ర అంతరాయం కలిగించింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన దాటికి మారుమూల గ్రామాల నుంచి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులతో వచ్చిన ప్రజానీకం తల దాచుకునేందుకు సముచిత ప్రదేశాలు లేక విలవిలలాడారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్డుమీద నిలిచిన వాహనాలపై వరద నీరు చేరడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచి పోయింది. తుంపర్లపై నిలిచిన నీటి ధారలు మరియు గాలివాన ప్రభావంతో విద్యుత్ సరఫరా కూడా అంతరాయం చెందింది. ప్రజలు అత్యవసర సేవలు, నిత్యావసర సరుకుల కోసం చింతపల్లికి వచ్చిన సమయంలో వర్షం బీభత్సంగా కురవడం తీవ్ర అసౌకర్యానికి కారణమైంది. అధికార యంత్రాంగం వర్ష ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వృద్ధులకు మొక్కలు పంపిణీ

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం అధ్యక్షులు కాండ్రేగుల అప్పారావు ఆధ్వర్యంలో రైతు భారతిలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వృద్ధులకు మొక్కలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణలో కాలుష్య నియంత్రణకు ప్రతిఒక్కరూ ఒక్క మొక్క నాటాలని అలాగే జూన్ 21న జరిగే 11వ యోగా దినోత్సవంలో వృద్ధులు అందరూ పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ కాండ్రేగుల నూకరాజు, డిస్ట్రిక్ట్ ఆయుష్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య, అధిక సంఖ్యలో వృద్ధులు పాల్గొన్నారు.




Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan